క్లుప్తంగా

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

దెందులూరు: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యపడుతుందని పలువురు వక్తలు తెలిపారు. ఏలూరు రూరల్ మండలం చాటపర్రు గ్రామంలో సోమవారం తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో శ్రీలత, అధికారులు, వైద్య సిబ్బంది యోగాంధ్ర ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం పంచాయతీ కార్యాలయం మమత స్కూల్ ఆటో స్టాండ్ హై స్కూల్ మీదుగా ఫ్లెక్సీలు చేత పట్టుకుని నినాదాలు చేసుకుంటూ ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు డిప్యూటీ తహసీల్దార్‌గా ప్రియదర్శిని



ఏలూరు డిప్యూటీ తహసీల్దార్‌గా ప్రియదర్శిని

దెందులూరు: ఏలూరు రూరల్ మండలం డిప్యూటీ తహసీల్దార్‌గా దెందులూరు మండలం డిప్యూటీ తహసీల్దార్ ప్రియదర్శిని నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి లిఖిత పూర్వకాదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా మండలంలోని వీఆర్వోలు, సిబ్బందిని ఆమె ప్రత్యేకంగా అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దెందులూరు: ఏలూరు రూరల్ మండలం గుడివాకలంక 11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో కొత్త 33 కేవీ లైన్ పోల్స్ ఏర్పాటు నిమిత్తం సోమవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కొక్కిరాయి లంక, పైడి చింతపాడు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేయడం జరుగుతుందని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అంబేడ్కర్ తెలిపారు. రెండు గ్రామాల్లో వినియోగదారులు విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని ఏలూరు రూరల్ మండలం విద్యుత్ శాఖ ఏఈ నరసయ్య విద్యుత్ వినియోగదారులను కోరారు.

డిప్యూటీ తహసీల్దార్‌గా శ్రీనివాస్

దెందులూరు: మండల డిప్యూటీ తహసీల్దార్‌గా శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి లిఖితపూర్వ ఆదేశాలు జారీ చేశారు. శ్రీనివాస్ ఏలూరు రూరల్ మండలం ఇన్‌చార్జి తహసీల్దార్‌గా పని చేస్తూ సాధారణ బదిలీల్లో దెందులూరు డీటీగా వచ్చారు.

సూపర్ సిక్స్... మోసం ఫిక్స్

- రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, ఉద్యోగులు...అందరికీ ఆశాభంగం
- అవినీతి, అక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా ఏడాది పాలన
- కూటమి పాలనలో మాయమైన మహిళా సంక్షేమం
- ఆడబిడ్డ నిధి కోసం నిరీక్షణ
- కొందరికే ఉచిత గ్యాస్
- అందని ఫ్రీ బస్సు



విద్యాదీవెన చెక్కు అందజేస్తున్న దృశ్యం(ఫైల్)



ఈబీసీ నేస్తం చెక్కు అందజేస్తున్న అప్పటి జిల్లా కలెక్టర్ (ఫైల్)

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఉపాధి లేదు.. సంపాదన తగ్గింది.. ప్రభుత్వ సంక్షేమం ఆగింది.. నిత్యావసర సామగ్రి ధరలు కొండెక్కాయి. విద్యుత్ బిల్లులు భారీగా పెరిగాయి. ఇంకేముంది మధ్య తరగతి వర్గాలు అప్పులు చేసుకుని వడ్డీలు కడుతూ కాలం వెల్లదీసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఏడాది క్రితం వరకు సంపాదించుకున్న మొత్తానికి జగన్ ప్రభుత్వం అందజేసిన సంక్షేమంతో ఆర్థిక ఇబ్బందులు తలెత్తకుండా కుటుంబాలను పోషించుకునే పరిస్థితి ఉండేదని కానీ నేడు కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాది కాలంలో అన్ని రకాల ధరలు పెరిగిపోవడంతో పాటు మధ్యతరగతి వర్గాలకు ఎటువంటి ప్రోత్సాహం లేదంటూ మండిపడుతున్నారు. ఇటు సంక్షేమం అందించక మానవాళి మనుగడకు అవసరమైన సామగ్రి ధరలు భారీగా పెరిగిపోవడంతో కుటుంబాలు పోషించుకోలేక చేసిన అప్పులకు వడ్డీలు చెల్లించుకోలేకపోతున్నామంటూ మధ్యతరగతి వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పేద, మధ్యతరగతి వర్గాలకు మొండిచేయి చూపి కార్పొరేటు వర్గాలు, పెత్తందార్లకు దోచిపెట్టే రోజులు వచ్చాయంటూ ప్రజానీకం విమర్శలు గుప్పిస్తున్నారు.

వ్యాపారరంగం అతలాకుతలం...

2019–24 మధ్య ఐదేళ్లపాటు జగన్ ప్రభుత్వ హయాంలో మూడు పువ్వులు ఆరు కాయల మాదిరిగా జరిగిన వ్యాపారాలు గత ఏడాది కాలంగా బోణీలు కూడా కాని దుస్థితిలో కొన్ని వ్యాపార సంస్థలు ఉండడం విశేషం. ఏ వ్యాపారస్తుని వద్దకు వెళ్లినా జనం దగ్గర డబ్బులు లేక ఏ సామాగ్రి కొనుగోలు చేయడంలేదంటూ బాహాటంగానే చెబుతున్నారు. ఐదేళ్లపాటు వివిధ సంక్షేమ పథకాలతో పేద, మధ్యతరగతి వర్గాలకు బ్యాంకు ఖాతాల్లో నగదు జమకావడంతో ఆర్థికంగా నిలదొక్కుకుని అవసరమైన సామగ్రిని కొనుగోలు చేసే పరిస్థితి ఉండగా నేడు సంపాదించిన సొమ్ము ఇళ్లు గడపడానికి కూడా సరిపోని పరిస్థితుల్లో పిల్లల అవసరాలు కూడా తీర్చలేని స్థితిలో సగటు వ్యక్తి ఉన్నారు. దీంతో వ్యాపారాలు జరగక అధికశాతం దుకాణాలు మూతలు పడే పరిస్థితి నెలకొంది.

గత ఐదేళ్లల్లో అందించిన పథకాలు ఇలా..

గత ప్రభుత్వం వైఎస్సార్ చేయూత, జగనన్న చేదోడు, వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ పెన్షన్ కానుక, ఆసరా, కాపు నేస్తం, అమ్మ ఒడి, ఈబీసీ నేస్తం, పంటల బీమా, రైతు భరోసా వంటి 27 సంక్షేమ పథకాలను నేరుగా అందిస్తూ బడుగుల అభివృద్ధికి బంగారు బాటలు పరిచింది. పాలనలో ఒక్క ఏలూరు నియోజకవర్గంలోని 79 సచివాలయాల పరిధిలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఇతర వర్గాలకు ప్రత్యక్ష నగదు బదిలీ(డిబిటి) ద్వారా రూ.958,72,38,563, పరోక్ష ప్రయోజనాలు(నాన్ డిబిటి) ద్వారా 729,03,92,844 కలిపి మొత్తం రూ.1,687,76,31,407 ప్రయోజనం చేకూరింది. మొత్తం లబ్ధిదారుల సంఖ్య 1,89,110 మంది ఉన్నారు. ఈ లెక్కన చూస్తే నియోజకవర్గంలోని ఓటర్లలో దాదాపు 90 శాతానికి పైగా ప్రజలకు ప్రభుత్వం నుండి ఆర్థిక సహకారం అందింది. దీనికి అదనంగా నియోజకవర్గంలోని 29,592 మందికి ఇండ్ల స్థలాలను ప్రభుత్వం అందించింది. దీంతో నియోజకవర్గంలోని అన్ని సామాజిక తరగతుల ప్రజల్లో ఆనందాలు, సంతోషాలు వెల్లివిరిశాయి. ఇది కదా సంక్షేమ పాలన అంటూ నాడు ఏలూరు నియోజకవర్గ ప్రజలు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు నీరాజనాలు పలికారు. అబద్ధపు హామీలతో అందలమెక్కిన కూటమి నేతలు ఏ ఒక్క హామీని నిలబెట్టుకోకుండా తమను మోసం చేసారంటూ నగరంలోని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

డీబీటీ జమలు లేక ఖాతాలు ఖాళీ..

గత ఐదేళ్లలో జగన్ ప్రభుత్వం అందించిన పథకాలతో నియోజకవర్గంలో దాదాపు 90 శాతం మంది ప్రజలు లబ్ధి పొందారు. 27 సంక్షేమ పథకాల్లో కనీసం నాలుగైదు పథకాలు ప్రతి కుటుంబానికీ వర్తించేది. దానితో వారి ఖాతాల్లో కనీసం ఏడాదికి రూ. 50 వేలు పైచిలుకు నగదు జమ అయ్యేది. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఒక్క పథకమూ అమలు చేయకపోవడంతో వారి ఖాతాలు ఖాళీఅయ్యాయి. అప్పట్లో కుటుంబ అవసరాల కోసం మరొకరిని దేహీ అనకుండా ఎవరికి వారు సగౌరవంగా జీవించే వారు. కానీ ప్రభుత్వం గత ఏడాది కాలంగా ప్రజల ఖాతాల్లో డబ్బులు వేయకపోవడంతో కుటుంబ పోషణ నిమిత్తం అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పేదల కష్టాలు పట్టని ప్రభుత్వం..

పేదలు ఇంతగా కష్టపడుతున్నా అధికారంలోకి వచ్చిన నాటి నుంచి లక్షల కోట్ల రూపాయలు అప్పులు తీసుకువచ్చినా ఒక్క రూపాయి కూడా ప్రజలకు అందించలేదు. దీంతో తెచ్చిన లక్షల కోట్ల అప్పులు ఎవరి కోసం అంటూ ప్రజలు నిలదీస్తున్నారు. ఒక పక్క పిల్లల చదువులకు లక్షలు ఖర్చుపెట్టాల్సిన పరిస్థితి నెలకొంది. గతంలో జగనన్న విద్యాదీవెన, వసతి దీవెనతో విద్యా ఖర్చులను అందుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు ప్రస్తుతం ఫీజు రీయాంబర్స్‌మెంట్ నిధులు జమచేయకపోవడంతో ఈ కొత్త విద్యా సంవత్సరంలో కళాశాలలు ముందుగానే ఫీజులు కట్టించుకుని గానీ విద్యార్థులకు ప్రవేశాలు కల్పించని పరిస్థితి వచ్చింది. తమ బిడ్డల భవిష్యత్ కోసం వేలాది రూపాయలు అప్పులు చేసి ఫీజులుగా ముందుగానే చెల్లిస్తున్నారు.

తొలి ఏడాది అందని సంక్షేమ పథకాలు..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్క పథకాన్ని అధికారంలోకి వచ్చిన తరువాత అమలు చేయలేదు. ఏలూరు నియోజకవర్గంలో 86,516 కుటుంబాలు ఉన్నాయి. వీటిలో ప్రభుత్వ ఉచిత గ్యాస్ సిలిండర్ పథకానికి నియోజకవర్గంలో 50 వేల వరకు అర్హత కలిగి ఉన్నారు. మొదటి సిలిండర్ సొమ్ములు కేవలం 25వేల లోపు లబ్ధిదారులకే పడ్డాయి. ఉచిత బస్సు ప్రయాణం అంటూ ఊదరగొట్టిన ప్రభుత్వం దాని గురించి నేటి వరకు ఎటువంటి ప్రకటనా విడుదల చేయలేదు. కనీసం మార్గదర్శకాలు సైతం రూపొందించలేదు. 19 సంవత్సరాల నుంచి 59 సంవత్సరాలు మధ్య ఉన్న ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఆర్థిక సహకారం అందిస్తామని సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా హామీ ఇచ్చారు. అధికారం చేపట్టి సంవత్సరం పూర్తయింది. ఆడబిడ్డల నిధి ఎప్పుడు ఇస్తారంటూ మహిళలు ప్రశ్నిస్తున్నారు. సూపర్ సిక్స్‌లో ఒక్క ఉచిత గ్యాస్ తప్పితే మిగతా ఏ పథకమూ అమలు చేయలేక కూటమి ప్రభుత్వం చతికిల పడిందని, చంద్రబాబు పాలనానుభవం కూటమి ప్రభుత్వానికి, సంక్షేమ పథకాల అమలుకూ ఉపయోగపడలేదని ఎద్దేవా చేస్తున్నారు.

హామీలు అమలు చేయాలి



కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఆడబిడ్డ నిధి పథకం అమలు కోసం ఎదురు చూస్తున్నాం. నెలకు రూ. 1500 చొప్పున వస్తుందని ఎంతో ఆశపడ్డాం. దాని కోసమే కూటమి అభ్యర్థికి ఓటు వేసి గెలిపించాము. దాంతో పాటు ఉచిత బస్సు పథకానికి ఆకర్షితులమయ్యాము. హామీలన్నీ అమలు చేస్తారని నమ్మకం పెట్టుకున్నాం. ఏడాది కాలమైనా ఒక్క పథకమూ అమలు చేయకపోవడం దారుణం.

చిట్టి వెంకట లక్ష్మి, గృహిణి

ఏడాది కాలంలో ప్రజలకు ఏమి చేశారు



కూటమి నాయకులు అధికారంలోకి వచ్చి ఏడాది కాలం గడిచింది. ఈ ఏడాది కాలంలో ప్రజల కోసం ఏమి చేశారో చెప్పాలి. ఇప్పటి వరకూ ఒక్క పథకమూ అమలు చేయకుండా నిధులు లేవనే సాకు చూపి సంక్షేమాన్ని కుంటుపరిచారు. ఇప్పటికైనా ప్రజలను మోసగించడం ఆపి ఇచ్చిన హామీలన్నీ అమలు చేయడానికి ప్రభుత్వం ముందుకు రావాలి.

తాళ్ళూరి చక్రవర్తి, కాంగ్రెస్ పార్టీ ఏలూరు నగర ఉపాధ్యక్షుడు.

ఏలూరు బస్ స్టేషన్‌లో సౌకర్యాల ఏర్పాటు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): పట్టణంలోని ఏలూరు కొత్త బస్టాండులో ప్రయాణికుల సౌకర్యార్థం, ప్రతి రోజు 300 లీటర్ల చల్లటి మంచినీటితో పాటు, బస్టాండ్ ఏరియాలో రాత్రిపూట ప్రయాణికుల సౌకర్యార్థం ఎంట్రెన్స్ గేట్, ఎలైటింగ్ పాయింట్‌లో నూతన లైటింగ్ సదుపాయం ఏర్పాటు చేసినట్టు ఏలూరు ఆర్టీసీ డిపో మేనేజర్ బీ. వాణి ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే అధునాతన, తక్కువ విద్యుత్ వినియోగించే బీఎల్‌డీసీ ఫ్యాన్లను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎనర్జీ కన్సర్వేషన్ మిషన్ సామాజిక బాధ్యతలో భాగంగా మొదటి విడతగా పంపిణీ చేసిన ఫ్యాన్ డిపో పరిధిలోని బస్ స్టేషన్‌లలో ప్రయాణికుల సౌకర్యార్థం వినియోగించామన్నారు. వీటి వల్ల ప్రయాణికుల సౌకర్యంతో పాటు, విద్యుత్ వినియోగం తగ్గి పరోక్షంగా పర్యావరణ పరిరక్షణలో పాలు పంచుకోవటమవుతుందన్నారు.

దోమ తెరల పంపిణీ

ఉంగుటూరు: ఆమెన్ ట్రస్టు అందిస్తున్న సేవలు విలువైనవని కాగుపాడు పీహెచ్‌సీ డాక్టర్ మానస అన్నారు. కొత్త ఉంగుటూరులో సోమ వారం 102 మందికి దోమ తెరలను ఆమెన్ ట్రస్టు సభ్యులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మానస మాట్లాడుతూ దోమ తెరలు వాడితే దోమలు దరి చేరవన్నారు. తాడేపల్లిగూడెం సబ్‌యూనిట్ అధికారి వై.వీ లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. లార్వా దశలోనే దోమలను నివారించాలన్నారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి కె.శ్రీనివాసరావు, ఆరోగ్య పర్యవేక్షకులు ఎస్.సత్యనారాయణ, ఆరోగ్య సహాయకులు గణపతి, కార్యకర్తలు సరోజ, చంద్రలీల, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పీహెచ్‌సీకి సామగ్రి బహూకరణ

గణపవరం: మండలంలోని కేశవరం గ్రామానికి చెందిన దాత వేగేశ్న రమేష్ వర్మ ఆర్థిక సాయంతో పీహెచ్‌సీ వైద్యాధికారి గదిలో ఒక ఏసీ, ప్రసూతి వార్డులో ఒక ఏసీ అందజేశారు. జనరల్ వార్డులోకి ఆరు పరుపులను అందజేశారు. ఈ సందర్భంగా దాత రమేష్ వర్మను పలువురు అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరక్టర్ ఇందుకూరి రామకృష్ణం రాజు, కొయ్యా సుబ్బారావు, కొలనువాడ శ్రీనివాసరాజు, రంగరాజు, కె.ప్రియాంక, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణ పనుల ప్రారంభం

భీమడోలు: గుండుగొలనులో అతి పురాతన దేవాయం ఆంజనేయస్వామి ఆలయం పునర్నిర్మాణ పనులు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. దేవాదాయ ధర్మదాయ శాఖ పరిధికి చెందిన ఈ ఆలయం 240 సంవత్సరాల క్రితం నిర్మించబడింది. దీంతో ఈ ఆలయం వర్షానికి శ్లాబ్ లీకై నీరు ఆలయంలోకి చేరుతుంది. స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. దీంతో స్పందించిన గ్రామానికి చెందిన దాతలు భోగరాజు పుండరీకాక్షుడు, రాధ దంపతులు, అమెరికాలోని మహిళా ఎన్‌ఆర్‌ఐలు రూ.70 లక్షల ఆర్థిక సాయం చేశారు. ఆలయ అర్చకులు లంకా శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకులకు గాయాలు

ఉంగుటూరు: మండలంలోని కైకరం వద్ద జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు గాయపడ్డారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. భీమడోలు మండలం గుండుగొలనుకు చెందిన సురేష్, ప్రేమ్‌చంద్ బైక్‌పై వెళుతుండగా, కైకరం వద్ద లారీని ఢీకొన్నారు. ఈ ఘటనలో యువకులు ఇద్దరూ గాయపడగా, క్షతగాత్రులను హైవే పెట్రోలింగ్ పోలీసులు అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

మావోయిస్టు నేత మృతికి సీపీఐ సంతాపం

పెదపాడు: మావోయిస్టు కీలక నేత తెంటు లక్ష్మీనరసింహాచలం అలియాస్ సుధాకర్ మృతికి సీపీఐ ఏలూరు జిల్లా సమితి కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య బీకేఎంయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు సంతాపాన్ని తెలిపారు. చత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన తెంటు సుధాకర్ మృతదేహాన్ని సత్యవోలు తీసుకొచ్చారని తెలియగానే సోమవారం సుధాకర్ ఇంటికి వెళ్లారు. అప్పటికే దహన సంస్కారాలు పూర్తవడంతో కుటుంబ సభ్యులను పరామర్శించారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	24	అరటి కాయ (1)	06–08
వంకాయలు (గులాబీ)	36	చిక్కుడు కాయలు	90
వంకాయలు (కాంతులు)	46	బీక్లదిక్కుడు	--
వంకాయలు (తెలుపు)	30	చామదుంపలు	46
బెండకాయలు	26	ములక్కాడలు	08, 10
పచ్చిమిర్చి	32	కంద	--
కాకర కాయలు	48	బీట్‌రూట్	36
బీరకాయలు	30	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	44	ఫ్రెంచ్‌బీన్స్	128
క్యాబేజీ	22	అల్లం	64
క్యారెట్	42	కొత్తిమీర (కట్ట)	25
దొండకాయలు	28	పాలకూర	12
బంగాళదుంపలు	30	తోటకూర	10
ఉల్లిపాయలు	24	చుక్కకూర	12
గోరుచిక్కుడు	44	గోంగూర	07–10
దోసకాయలు	20	పుదీనా	05
అనబకాయ (1)	10–15	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	26
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	27
ఏలూరు –బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	41
ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	01
ఏలూరు - అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్	21.45	4820	20
ఏలూరు –బీహెచ్ఈఎల్	21.15	4822	26
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	12
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	02
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	25
ఏలూరు – బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	12
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	11
ఏలూరు –బీహెచ్ఈఎల్	21.40	98507	37
ఏలూరు – తిరుపతి	16.00	4830	25

యథేచ్ఛగా మట్టి అక్రమ తవ్వకాలు

ఉంగుటూరు: తిమ్మయ్యపాలెం గ్రామం చెరువులో మట్టి అక్రమంగా తవ్వి తరలిస్తున్నారు. మట్టి తీయడానికి అనుమతులు తీసుకున్నామని చెబుతూ అనుమతి పొందిన దాని కంటే ఎక్కువ తవ్వి మట్టితో వ్యాపారం సాగిస్తున్నారు. తిమ్మయ్యపాలెం ఖండ్రిక చెరువులో అక్రమంగా మట్టిని తవ్వి ట్రాక్టర్లతో తరలిస్తున్నారు. టీడీపీ నాయకుల నేతృత్వంలో ఈ మట్టి దందా నడుస్తోంది. ఈ విషయంపై తహసీల్దార్ రవికుమార్‌ను వివరణ అడగగా కొన్ని చెరువులు అభివృద్ధికి అనుమతులు తీసుకున్నారని తెలిపారు. మట్టిని అక్రమంగా తవ్వేవారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. వీఆర్వో లను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నామని తహసీల్దార్ వివరించారు.

కోకో గిట్టుబాటు ధరలపై ఆరా



కోకో రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ సుమతి

దెందులూరు: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం దెందులూరు తహసీల్దార్ బి.సుమతి గంగన్నగూడెం, నాగులదేవునిపాడు గ్రామాల్లో కోకో తోటలను పరిశీలించారు. రైతులతో ముఖాముఖి నిర్వహించి కోకో పంట దిగుబడి ఖర్చు, సాగు రవాణా వాతావరణ పరిస్థితులపై క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. కోకో రైతుల సమస్యలపై జిల్లా కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో వీఆర్ఓ శ్రీనివాస్, కోకో రైతులు పాల్గొన్నారు.

పంట కాలువలోకి నీరు విడుదల

భీమడోలు: ఏలూరు పంట కాలువలోకి నీటిని విడు దల చేశారని, ఈ నెల 10వ తేదీ మంగళవారానికి పూళ్ల చేరుకుంటుందని గుండుగొలను వాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ గంధం లక్ష్మణ్ సోమవారం రాత్రి తెలిపారు. కానీ కాలువలో నీటి స్థాయి నిలవడానికి నాలుగైదు రోజులు పడుతుందని ఆయన తెలిపారు. నవాబుపాలెం వద్ద అడ్డుకట్టను తొలగించామన్నారు. గ్రామాల్లోని మంచినీటి చెరువుల్లోకి నీటిని నింపేందుకు చర్యలు చేపడతామన్నారు. తాగునీటి ఇబ్బందులు తీరుతాయని, ప్రజలు ఆందోళన చెందనవసరం లేదని ఆయన తెలిపారు.

పోలీస్ సిబ్బంది కుటుంబాలకు కారుణ్య నియామకాలు

హోంగార్డు కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేత



పోలీస్ సిబ్బంది కుటుంబాలతో ఏలూరు జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్, అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లా పోలీస్ సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తామనీ, ఉద్యోగ నిర్వహణలో అసువులు బాసిన, పదవీ విరమణ చేసిన సిబ్బంది కుటుంబాలను ఆదుకుంటామని ఏలూరు జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ అన్నారు. ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో హోంగార్డు సిబ్బంది కుటుంబాలకు కారుణ్య నియామకాలు, ఆర్థిక సహాయాన్ని జిల్లా ఎస్పీ చేతులమీదుగా అందజేశారు. హోంగార్డు ఎస్‌వీపీకేహెచ్ చిట్టిబాబు సతీమణి రజనికి రూ.5,25,240ల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. హోంగార్డు కే.సత్తిరాజు కుమారుడు శివకు కారుణ్య నియామక పత్రం, డెత్ బెనిఫిట్స్ రూ.15వేల చెక్కును అందజేశారు. హోంగార్డు సీహెచ్‌డీ శ్రీనివాసరావు కుమారుడు చైతన్యకు కారుణ్య నియామక పత్రం, రూ.5,43,860ల ఆర్థిక సహాయం, డెత్ బెనిఫిట్స్ రూ.15వేలు చెక్కులను అందజేశారు. హోంగార్డు బొత్త రాజేష్‌కుమార్ కుమారుడు జయశంకర్‌కు కారుణ్యనియామక పత్రం అందజేశారు. హోంగార్డు ఎం.ఏడుకొండలు సతీమణికి కారుణ్యనియామక పత్రం అందజేశారు. హోంగార్డు సీహెచ్ శ్రీరామ నారాయణ సతీమణి లక్ష్మి నరసింహకు రూ.5,23,980లు, హోంగార్డు వీ.సత్యనారాయణ కుటుంబానికి రూ.5,23,980లు, హోంగార్డు వై.అప్పారావు సతీమణి ధనలక్ష్మికి డెత్ బెనిఫిట్స్ రూ.15వేలు, హోంగార్డు సత్తిరాజు సతీమణి అంబికాకు డెత్ బెనిఫిట్స్ రూ.15వేలు జిల్లా ఎస్పీ చేతులమీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు, ఆర్ఐ పవన్‌కుమార్, ఆర్ఎస్ఐ భాస్కరరావు ఉన్నారు.

చింతలపూడిలో బాలికల హైస్కూల్‌ను కొనసాగించాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): చింతలపూడిలో 64 సంవత్సరాల చరిత్ర కలిగిన జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలని యథావిధిగా కొనసాగించాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. పీడీఎస్‌యూ ముఖ్య నాయకుల సమావేశం సోమవారం స్థానిక పీడీఎస్‌యూ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కాకి నాని మాట్లాడుతూ చింతలపూడి బాలికోన్నత పాఠశాలను అక్కడున్న హెచ్ఎం ప్రోత్బలంతో ఎస్ఎంసీ కమిటీలో తమ అనుకూలస్తులతో తీర్మానం చేయించి బాలికల పాఠశాలగా ఉన్న పాఠశాలని బాల బాలికల(కో ఎడ్యుకేషన్) పాఠశాలగా మార్చడం వెనుక పెద్ద కుట్ర జరిగిందన్నారు. ఈ పాఠశాలకి రెండు మూడు కిలోమీటర్ల పరిధిలోని రెండు బాల బాలికల(కో ఎడ్యుకేషన్) పాఠశాలలు ఉన్నప్పటికీ కూడా ఎందుకు మార్చవలసి వచ్చిందో అధికారులు సమాధానం చెప్పాలని నాని జిల్లా విద్యాశాఖ అధికారిని డిమాండ్ చేశారు.

జ్వరాన్ని నిర్లక్ష్యం చేయకూడదు

గణపవరం: ప్రస్తుతం మారిన వాతావరణ పరిస్థితుల్లో ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని, జ్వరం వస్తే ఏ మాత్రం నిర్లక్ష్యం చేయకుండా వెంటనే రక్త పరీక్షలు చేయించుకోవాలని గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారులు పి.కిరణ్మయి, కె.ఓంకార్‌నాథ్‌లు అన్నారు. సోమవారం మలేరియా వ్యతిరేక మాసోత్సవం సందర్భంగా పీహెచ్‌సీలో మలేరియా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వారు మాట్లాడుతూ జ్వరం వచ్చిన వెంటనే రక్త పరీక్షలు చేయించుకోవడం మంచిదని, మలేరియా లేదని తేలితే భయపడనవసరం లేదన్నారు. ఒకవేళ మలేరియా లక్షణాలు కనిపిస్తే వెంటనే చికిత్స పొందడం ద్వారా మలేరియా వ్యాధి నుంచి బయట పడొచ్చన్నారు. ప్రతి శుక్రవారం పొడి వారంగా పాటించాలని, తడి, నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, దోమల నుంచి రక్షణ చర్యలు తీసుకోవాలని, దోమలు పుట్టకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇళ్ల పరిసరాల్లో మురుగు నీటి నిల్వలు, కొబ్బరి బొండాలు, పాతటైర్లు, పాత సామాన్లు లేకుండా చూడాలన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో నినాదాలు చేస్తూ ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో జాలాది విల్సన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ ఉపకార వేతనానికి ఎంపిక

బుట్టాయగూడెం: జాతీయ ఉపకార వేతనానికి రెడ్డిగణపవరం జిల్లా పరిషత్ హైస్కూల్ 8వ తరగతి విద్యార్థి మడకం కృష్ణ ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్. రామారావు సోమవారం తెలిపారు. ఇటీవల జరిగిన ఎన్ఎమ్ఎస్ ప్రతిభా పరీక్షల్లో కృష్ణ ఉత్తీర్ణత పొందినట్లు చెప్పారు.